ప్రజాశక్తి

www.prajasakti.com

బుధవారం 19 జూన్ 2024

5

అన్నమయ్య

రేపు రాజంపేటలో ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం

ప్రజాశక్తి - కడప అర్బన్ : కడపలోని మాతృశ్రీ ఐవిఎఫ్ క్లినిక్ ఆధ్వర్యంలో రాజంపేట రైల్వే స్టేషన్ రోడ్‌లో ఉన్న రామచంద్ర హాస్పిటల్‌లో ఈ నెల 20న ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రముఖ సంతాన సాఫల్య వైద్య నిపుణురాలు, లాప్రోస్కోపీ సర్జన్ డాక్టర్ వై. ప్రమోద తెలిపారు. మంగళవారం నగరంలోని సురక్ష సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాతృశ్రీ ఐవిఎఫ్ క్లినిక్ ఆధ్వర్యంలో సామాజిక సేవా దృక్పథంతో వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాలలో ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్పొరేట్ వైద్యాన్ని సామాన్యులకు సైతం చేరువ చేసేందుకు వీలుగా ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. సంతాన సాఫల్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ శిబిరంలో డాక్టర్ కన్సల్టేషన్ ఉచితమని, దంపతులకు కౌన్సెలింగ్ కూడా ఇస్తామని తెలిపారు. శిబిరానికి విచ్చేసిన వారికి తమ ఆసుపత్రిలో 30 రోజుల పాటు ఉచిత ఒపి సౌకర్యం ఉంటుందని పేర్కొన్నారు. ఐవిఎఫ్, ఐయుఐ తదితరాల్లో శిబిరానికి విచ్చేసిన వారందరికీ రాయితీ ఉంటుందని చెప్పారు. రాజంపేట పరిసర ప్రాంతాల ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ సేవలను విస్తృతం చేయాలి

- కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్

విసిలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి-రాయచోటి

ప్రభుత్వ శాఖలలో ప్రజలకు అందించే రోజువారి సేవలను విస్తృతం చేయడంపై దృష్టి పెట్టాలని కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లతో గ్రామ వార్డు సచివాలయ సేవలు, ఇ-సర్వీసెస్ పెండింగ్ పేమెంట్స్, ఎన్ఆర్ఇజిఎస్, తాగు నీరు, జల్ జీవన్ మిషన్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ, రెవెన్యూ సర్వీసులు, భూ సేకరణ, సివిల్ సప్లై తదితర అంశాలలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎలాంటి పెద్ద సంఘటనలు జరగ కుండా అందరూ కష్టపడి పని చేసి సాధారణ ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేశారని పేర్కొన్నారు. ఎన్నికలకు సంబంధించి ఆయా నియోజకవర్గాలలో ఇంకా ఎక్కడైనా టిఎడిఎ, ఎన్నికలలో చేసిన పనులకు సంబంధించిన చెల్లింపులు పెండింగ్‌లో ఉంటే వాటన్నిటి బిల్లులు వెంటనే చెల్లించాలని సూచించారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి ఐదు ఫైల్స్‌పై ప్రాధాన్యతగా సంతకాలు చేశారని, సూపర్ సిక్స్ పథకాలు ప్రకటించారని వీటన్నిటిపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లాలో గతంలో ఎక్కడైతే అన్న క్యాంటీన్లు ఉన్నాయో వాటి పరిస్థితిపై ఎంపిడిఒ, మున్సిపల్ కమిషనర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక సిద్ధం చేయాలని, వంద రోజుల లోపల పనులు చేపట్టాలని సూచించారు. పాఠశాలలు తెరిచారని, అవసరమైన వారికి సర్టిఫికెట్లు జారీ చేయాల్సి ఉంటుందన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అమలు చేస్తున్న సేవలను పెండింగ్ ఉంచకుండా పరిష్కరించాలని సూచించారు. హౌస్ హోల్డ్ మ్యాపింగ్ అంశంలో ఇప్పటి వరకు ఎన్ని మ్యాపింగ్ చేశారు, ఇంకనూ చేయాల్సినవి ఎన్ని, పెండింగ్ ఉండడానికి గల కారణాలు తదితరాలను పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఆధార్ సర్వీసులను పెంచాలన్నారు. జిల్లాలో అవసరమైన కుటుంబాలకు ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పనులను తప్పనిసరిగా కల్పించాలన్నారు. అన్ని మండలాలలో ఎంపిడిఒలు ఉపాధి హామీ పనులు జరిగే ప్రాంతాలను తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో సందర్శించి లేబర్ బడ్జెట్ జనరేషన్‌ను మెరుగుపరచాలని సూచించారు.గత సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే కె.వి పల్లి, పీలేరు, వాయల్పాడు, మదనపల్లి, నిమ్మనపల్లి, తంబళ్లపల్లి, గాలివీడు తదితర కొన్ని మండలాలలో ప్రగతి చాలా తక్కువగా ఉందని తెలిపారు. ఉపాధి హామీలో ఉద్యానవన పనులకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలన్నారు. జిల్లాలో గ్రామీణ నీటి సరఫరా శాఖ ద్వారా జల్‌జీవన్ మిషన్ కింద గుర్తించిన అవసరమైన పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. స్పందన కార్యక్రమాన్ని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థగా మార్చినందున ఆన్‌లైన్ పోర్టల్‌లో ఇప్పటికే నమోదైన ప్రజల సమస్యల దరఖాస్తులను వెంటనే పరిశీలించి పరిష్కార చర్యలను తీసుకోవాలన్నారు. రెవెన్యూ అంశాలకు సంబంధించి మ్యుటేషన్స్, వాటి కరెక్షన్స్, ట్రాన్సాక్షన్స్ అంశాలలో క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించి పారదర్శకంగా ఏలాంటి ఫిర్యాదులు అభియోగాలు లేకుండా పరిష్కరించాలని సూచించారు. వెబ్ ల్యాండ్‌లో ల్యాండ్ కన్వర్షేషన్ అంశాలపై దృష్టి పెట్టాలని తెలిపారు. వివిధ అభివృద్ధి పథకాలకు సంబంధించిన భూసేకరణలలో ఏయే ప్రాజెక్టులు ఉన్నాయి, ఇప్పటివరకు సాధించిన ప్రగతి, ఇంకను సాధించాల్సిన లక్ష్యం, కోర్టు కేసుల పెండింగ్ తదితరాలలో క్షుణ్ణంగా అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం జారీ చేసే మార్గదర్శకాల మేరకు ప్రజలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తామన్నారు. ఈ విషయాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని పేర్కొన్నారు. అనంతరం వివిధ అంశాలలో పలు సూచనలు జారీ చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్‌ఒ సత్యనారాయణరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

జిజిహెచ్‌లో ఆడిట్ గుబులు

- సెక్యూరిటీ, శానిటేషన్, డ్రగ్స్ ఖర్చులపై ఫోకస్
- మీటర్ల ట్యాంపరింగ్, అద్దె చెల్లింపుల్లో గందరగోళం
- మూడు వారాలకుపైగా ఆడిట్ అధికారులు తిష్ట
- నేడు ఆడిట్ నివేదిక అందజేత?

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి నిర్వాహకుల్లో ఆడిట్ గుబులు నెలకొంది. 2015 నుంచి 2024 సంవత్సరం వరకు పదేళ్లుగా ఆడిట్‌కు నోచుకోలేదు. ప్రతి మూడేళ్లకు ఒకసారి ఆడిట్ చేయాల్సి ఉంది. ఇటీవల స్టేట్ ఆడిట్ యంత్రాంగం రాష్ట్రంలోని వైద్యశాలల ఆడిట్ నిర్వహణకు శ్రీకారం చుట్టింది. జిల్లా సర్వజన ఆస్పత్రి చేసిన ఖర్చులపై ఆడిట్ చేపట్టింది. 2019 నుంచి 2024 వరకు జిజిహెచ్ క్రయ,విక్రయ పద్దుల పారదర్శకతను పరిశీలించింది. మూడు వారాలుగా కడప నగరంలోని ఓ హోటల్, జిజిహెచ్‌లోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలోని రెండేసి గదుల్లో ఆడిట్ యంత్రాంగం తిష్ట వేసింది. జిజిహెచ్ క్రయ, విక్రయాలు, రెండు క్యాంటీన్ల అద్దెలు, దోబి, ప్రాణ వాయువు, ఎంఆర్ఐ, సిటి స్కానింగ్ మీటర్ల ట్యాంపరింగ్ వంటి పలు విభాగాల్లో పెద్దఎత్తున లోపాలను గుర్తించినట్లు సమాచారం. కోట్లాది రూపాయల విలువ కలిగిన లోపాలపై జిజిహెచ్ నిర్వాహకుల్లో గుబులు రేగుతోంది. సెక్యూరిటీ, శానిటేషన్ చెల్లింపులను సైతం పరిశీలించింది. డ్రగ్స్ కొనుగోళ్లలో నెలకొన్న గందరగోళాన్నీ పరిశీలించినట్లు సంబంధిత అధికారి పేర్కొనడం గమనార్హం. కోట్లాది రూపాయల ఖర్చుల్లో పారదర్శకతకు అవకాశం లేకుండా పోయినట్లు సమాచారం. ఇంతటి అవకతవకలకు ఆస్కారం కలిగిన విభాగాలకు సంబంధించిన నివేదిక రూపకల్పనలో ఆడిట్ అధికారులు నిమగ్నమయ్యారు. సదరు విభాగాల అవకతవకలకు సంబంధించిన ఎవిడెన్స్ కాపీలను నివేదికకు జతపరిచే ప్రయత్నాల్లో ఉన్నట్లు సమాచారం. ఎవిడెన్స్‌లతో సహా ఆడిట్ నివేదికను స్టేట్ ఆడిట్ విభాగపు ఉన్నతాధికారులకు అందజేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. స్టేట్ ఆడిట్ ఉన్నతాధికారులు నివేదికను పరిశీలించిన అనంతరం అవకతవకల రికవరీ, లేదా బాధ్యులైన సంబంధిత అధికారులపై చర్యలకు సిఫారసు చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఆడిట్ నిర్వహణపై జిజిహెచ్ సూపరింటెండెంట్‌ను ఫోన్‌లో సంప్రదించగా ఆడిట్ యంత్రాంగం లోపాలను మా దృష్టికి తెచ్చిన మాట వాస్తవమేనని, అందుకు సంబంధించిన సమాచారాన్ని ఇచ్చామని పేర్కొనడం గమనార్హం.

ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య బృందం, విద్యార్థులు

దోమ కాటు నుంచి రక్షణ పొందండి

ప్రజాశక్తి-పీలేరు

ప్రజలు దోమ కాటుకు గురికాకుండా తగిన రక్షణ పొందాలని డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. మలేరియా మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా పీలేరు మండలం, తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యాధికారి డాక్టర్ రమేష్‌రెడ్డి, వైద్య బృందం దోమకాటు-చేటు అనే నినాదంతో మంగళవారం తలుపుల పాఠశాల విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ జూన్, అక్టోబర్ మాసాల మధ్య కాలంలో సాధారణంగా ఆడ అనాఫిలస్ దోమ కాటు ద్వారా మలేరియా వ్యాధి ఒకరి నుండి మరొకరికి వ్యాధి వ్యాప్తి చెందుతుందని తెలిపారు. రోజు విడిచి రోజు జ్వరం రావడం, తల, వంటి నొప్పులు, వణుకుతో కూడిన చలి, జ్వరం, చెమటలు పట్టడం మొదలు లక్షణాలతో కూడిన జ్వరాన్ని మలేరియాగా అనుమానించాలని చెప్పారు. జ్వర బాధితులను తక్షణం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి ఉచిత వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకుని, చికిత్స ఆరంభించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, పర్యవేక్షకులు శ్రీనివాసులు, కృష్ణయ్య, ఉపాధ్యాయులు, ఎఎన్ఎం నాగవేణి, ఆశ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన మెడికల్ విద్యార్థులు

ప్రజాశక్తి - కడప

వైఎస్ఆర్‌యుహెచ్ఎస్, యుజిఎస్ఆర్ఎస్- 2023 స్కాలర్షిప్ రూ.10 వేలు అందుకునేందుకు కడప ప్రభుత్వ మెడికల్ కళాశాలలో నాలుగవ సంవత్సరం ఎంబిబిఎస్ విద్యనభ్యసిస్తున్న ఆర్తి కిరణ్, మూడవ సంవత్సరం ఎంబిబిఎస్ చదువుతున్న విద్యార్థి షణ్ముఖ శ్రీనివాస్ ఎంపికయ్యారు. ఆర్తి కిరణ్ 'అండర్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులలో నిద్ర పరిశుభ్రత, పగటిపూట నిద్రపోవటం' అనే అంశంపై పరిశోధన చేశారు. కమ్యూనిటీ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఏ దివ్యశ్రీ ఆధ్వర్యంలో ఆర్థి కిరణ్ ఈ పరిశోధన (రిసర్చ్) చేశారు. ఇందుకుగాను రూ 10,000 స్కాలర్షిప కు ఆర్తి కిరణ్ ఎంపికయ్యారు. షణ్ముఖ శ్రీనివాస్ ' టైప్-2 డయాబెటిస్ మెల్లిట్స్‌పైలో లక్షణ రహిత బాక్టీరియా" అనే అంశంపై పరిశోధన (రిసర్చ్) చేశారు. మైక్రో బయాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఖాజా మొహిదీన్ ఆధ్వర్యంలో షణ్ముఖ శర్మ ఈ పరిశోధన నిర్వహించి స్కాలర్షిప్‌కు ఎంపికయ్యారు.

బాధితులను ఆదుకుంటాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి ఎగవకురవంకలోని ఇళ్లలోకి నీరు చేరిందని, బాధితులందరినీ ఆదుకుంటామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. మంగళవారం ఆయన ఎగువకురవంక ముంపు ప్రాంతాలలో పర్యటించారు. బాధితులని పలకరించి మనో ధైర్యం చెప్పి భరోసా ఇచ్చారు. నీట మునిగిన 25 కుటుంబాల వారికి వెంటనే 20 కిలోల బియ్యం పంపిణీ చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ముంపు ప్రాంతంలో వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ప్రమీలను ఆదేశించారు. పిఎన్‌టి కాలనీలో మరమ్మతు గురైన వాటర్ ట్యాంకును వెంటనే రిపేరు చేయించాలని అధికారులకు సూచించారు. ముంపు ప్రాంతాల్లో ఉన్న 25 కుటుంబాల వారికి త్వరలో ప్రభుత్వం తరపున ఆర్థిక సాయం అందేలా చూస్తామన్నారు. ఇండ్ల పునాదులను ఎత్తుగా నిర్మించుకోవాలని స్థానికులకు సూచించారు. ముంపు ప్రాంతంలో సహాయక చర్యలను ముమ్మరం చేసి బాధితులను అన్ని విధాల ఆదుకుంటామన్నారు. ఎమ్మెల్యే వెంట మాజీ కౌన్సిలర్లు రాధమ్మ, రంగస్వామి నాయుడు, జెసిబి వేణు, గాంధీ పురం నారాయణ, కలకడ వేణుగోపాల్, మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖాధికారులు, శానిటరి అధికారులు, కార్మికులు ఉన్నారు.

ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

త్వరలో మదనపల్లె జిల్లా ఆవిర్భావం

- జిల్లా సాధన సమితి ఆత్మీయ సన్మానంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను సన్మానిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె ప్రజల దశాబ్దాల కల సాకారమయ్యే సమయం ఆసన్నమైందని, త్వరలోనే జిల్లా ఆవిర్భావం జరగబోతోందని ఎమ్మెల్యే షాజహాన్ బాషా స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక బర్మావీధిలోని ప్రయివేట్ ఫంక్షన్ హాల్లో మదనపల్లె జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక జిల్లాకు ఉండాల్సిన అన్ని అర్హతలూ మదనపల్లెకు ఉన్నాయని, బ్రిటిష్ కాలంలోనే ఇక్కడ సబ్ కలెక్టరేట్ ఉండేదని పేర్కొన్నారు. మదనపల్లెను జిల్లాగా అప్ గ్రేడ్ చేయాల్సి ఉందని చెప్పారు. మదనపల్లెలో జరిగిన టిడిపి మినీ మహానాడులోను, బెంగళూరు బస్టాండ్‌లో జరిగిన ఎన్నికల ప్రచార సభలోనూ చంద్రబాబు నాయుడు తాము అధికారంలోకి రాగానే మదనపల్లెను జిల్లా చేస్తామని మాటిచ్చారని, యువగళం పాదయాత్రలో లోకేష్ బాబు కూడా రొంపిచర్ల, మదనపల్లె సభల్లో మదనపల్లె జిల్లా ఏర్పాటు చేస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం మదనపల్లె జిల్లా ఏర్పాటుకు తమ ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టిందని, త్వరలోనే మదనపల్లె జిల్లా ఆవిర్భావం జరుగుతుందని చెప్పారు. మదనపల్లె జిల్లా కోసం పోరాడిన ఉద్యమకారులపై పెట్టిన కేసులన్నీ ఎత్తివేయిస్తానని హామీ ఇచ్చారు. జిల్లా సాధన సమితి నేతలు శివప్రసాద్, బిటి కళాశాల కరెస్పాండెంట్ మునిరత్నం మాట్లాడుతూ మదనపల్లె జిల్లా ఆకాంక్షను అప్పటి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు 633 రోజుల పాటు ఉద్యమం చేశామని, 2826 వినతి పత్రాలు జిల్లా కలెక్టరుకు అందజేశామని చెప్పారు. అనంతరం టౌన్ బ్యాంక్ మాజీ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, ప్రజాకవి పోతబోలు రెడ్డెప్ప సిపిఐ నాయకులు కృష్ణప్ప, పోర్డు లలితమ్మ, గ్రామ జ్యోతి సుభద్ర, ముత్తరాశి హరికృష్ణ, జంగాల శివరాం, రాటకొండ మధుబాబు, సుబ్రహ్మణ్యం, గుండాల రామచంద్ర, టి.ఎ.పీర్ బాషా, కోనేటి దివాకర్, గంగులప్ప, ఆనందన్ ఎమ్మెల్యేని దుస్సాలువతో ఘనంగా సత్కరించి, ప్రత్యేకంగా తయారు చేయించిన జ్ఞాపికను ఆయనకు బహుకరించారు. కార్యక్రమంలో టిడిపి మాజీ కౌన్సిలర్లు తలారి రాధ, పులి మహాలక్ష్మి, వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొదల నరసింహులు, విసికె పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ముత్యాల మోహన్, బలిజ జెఎసి నాయకుడు ప్రసాద్, ఖుబా ఫౌండేషన్ ప్రతినిధి కమృద్దీన్, ప్రింటింగ్ ప్రెస్ అసోసియేషన్ నాయకుడు వెంకటేష్‌లతోపాటు వివిధ సంఘాలు, సంస్థలు, రాజకీయ పార్టీలకు చెందిన నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్నికల్లో హోంగార్డుల సేవలు అభినందనీయం

- రాయలసీమ హోంగార్డ్స్ కమాండెంట్ మహేష్ కుమార్

మాట్లాడతున్న కమాండెంట్ మహేష్ కుమార్

ప్రజాశక్తి-కడప అర్బన్

ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో హోంగార్డ్స్ సేవలు అభినందనీయమని రాయలసీమ హోంగార్డ్స్ కమాండెంట్ ఎం.మహేష్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం కడప సబ్ డివిజన్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డ్స్‌కు వెల్ఫేర్ మీటింగ్ స్థానిక ఉమేష్ చంద్ర కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ జిల్లా పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలని హోంగార్డ్స్‌కు పిలుపునిచ్చారు. మెడికల్ బిల్స్‌ను ప్రతి ఒక్క హోంగార్డ్ అవసరమైనపుడు అప్లై చేసుకోవాలని సూచించారు. హోంగార్డ్స్‌ల దైనందిన విధులు సవాళ్లతో కూడుకున్నవేనన్నారు. ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఆరోగ్యంగా ఉన్నపుడే సమర్ధవంతంగా విధులు నిర్వర్తించడానికి వీలవుతుందన్నారు. విధుల్లో నైపుణ్యాన్ని బాగా మెరుగుపరుచుకోవాలని పలు మెలకువలు సూచించారు. డ్రిల్, కవాతు, ప్రముఖుల బందోబస్తు, ట్రాఫిక్ తదితర విధులు మరింత సమర్థవంతంగా ఎలా నిర్వహించవచ్చో దిశానిర్దేశం చేశారు. హోంగార్డ్స్ సంక్షేమంలో భాగంగా పలు చర్యలు తీసుకుంటున్నామని కమాండెంట్ మహేష్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీశైలరెడ్డి. హోంగార్డ్స్ పాల్గొన్నారు.

ఆ విద్యా సంస్థల దోపిడీని అరికట్టాలి

ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండలంలోని ప్రయివేటు, కార్పొరేటు విద్యా సంస్థలు అధిక ఫీజులతో విద్యార్థుల తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తున్నాయని, విద్యా సంస్థల దోపిడీని సంబంధిత శాఖ అధికారులు అరికట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు నేతి నాగేశ్వర డిమాండ్ చేశారు. మంగళవారం వారు పట్టణంలోని వివిధ కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలలకు వెళ్లి పాఠశాలల ఆగడాలపై ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాహక్కు చట్టాన్ని లెక్కచేయకుండా పాఠశాలలు నడుపుతున్నా విద్యాశాఖ అధికారులు నిద్ర మత్తులో వున్నారన్నారు. ప్రయివేటు, కార్పొరేటు విద్య సంస్థలు విద్యా హక్కు చట్టానికి భిన్నంగా వేల రూపాయలు ఫీజులు వసూలు చేయడమే కాకుండా స్టేషనరీ పేరుతో పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్, టై, బెల్ట్, ఐడి కార్డ్, షూ, వంటి పేర్లతో దాదాపుగా రూ.20 వేల వరకు ఒక్కొక్క విద్యార్థి నుంచి వసూలు చేస్తూ నిలువుదోపిడీలకు పాల్పడుతున్నారని తెలిపారు. విద్యాహక్కు చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని ప్రభుత్వాలు సూచిస్తున్నా నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారన్నారు. బహిరంగంగా ప్రయివేటు, కార్పొరేటు విద్యా సంస్థలు విచ్చలవిడితనానికి పాల్పడుతున్నా విద్యాశాఖ అధికారులు గాఢ నిద్రలో ఉన్నారన్నారు. గుర్తింపు లేని కొన్ని పాఠశాలలు అడ్మిషన్లకు పాల్పడుతున్నప్పటికీ విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని ఆరోపించారు. ఫీజులు నియంత్రణ చట్టం తేవాలని, అధిక ఫీజులు అరికట్టాలని, విద్యహక్కు చట్టం పటిష్ఠంగా అమలు చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు ఆధ్వర్యంలో భవిష్యత్తులో ఉద్యమ కార్యచరణ చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రమణ, విద్యార్థి సంఘ నాయకులు చంగయ్య, మనోహర్, హరి పార్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న ఫ్యాప్టో నాయకులు

ఉపాధ్యాయుల సర్దుబాటు చేపట్టాలి : ఫ్యాప్టో

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను సరైన పద్ధతిలో సర్దుబాటు చేయాలని ఫ్యాప్టో ఉద్యోగ సంఘాల నాయకులు మంగళవారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం చివర్లో డిప్యూటేషన్‌లో ఉన్న ఉపాధ్యాయులు వారి వారి మాతృ పాఠశాలలకు వెళ్లారని తెలిపారు. తిరిగి విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే ఉపాధ్యాయుల సర్దుబాటు కారణంగా డిప్యూటేషన్లు ప్రారంభించాలని కోరారు. గత ప్రభుత్వం రాజకీయ ఒత్తిడులు, ప్రలోభాల కారణంగా ఎలాంటి సమీకరణాలు పాటించకుండా ఇష్టారాజ్యంగా ఉపాధ్యాయుల సర్దుబాటు చేపట్టారన్నారు. దానివల్ల చాలామంది ఉపాధ్యాయులు ఇబ్బంది పడ్డారని తెలియజేశారు. గతంలో మాదిరి కాకుండా అన్ని సమీకరణాలను క్రోడీకరించి, పరిశీలించి సీనియారిటీ పరంగా ఉపాధ్యాయుల సర్దుబాటులను చేపట్టాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే అందరి కోరిక మేరకే ఆమోదయోగ్యమైన ఉపాధ్యాయ సర్దుబాటులు ఉంటాయని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో పురం వెంకటరమణ, సుధాకర్, అశోక్, మోహన్, ఖాదర్‌బాషా ఉన్నారు.

బడిలో అడుగు.. భవితకు వెలుగు

ప్రజాశక్తి - రాయచోటి

బడిలో వేసే అడుగే విద్యార్థుల భవితకు వెలుగవుతుందని ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి అన్నారు. సంబేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉదయం 'నేను బడికి పోతా' విద్యా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించేందుకు ఈనెల 13 నుంచి జులై 12 వరకు ప్రభుత్వం 'నేను బడికి పోతా' అనే కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. 6 నుంచి 14 సంవత్సరాల పిల్లలందరూ బడులలోనే ఉండాలని, బడి మానేసిన పిల్లలను తిరిగి బడుల్లో చేర్పించాలనేది ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. బడులలోనే విద్యార్థులకు భద్రత ఉంటుందనేది తల్లిదండ్రులు మరవరాదన్నారు. విద్యార్థులకు బంగారు భవిష్యత్తు వారు బాగా చదువుకోవడం ద్వారా మాత్రమే సమకూరుతుందన్నారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించారని తెలిపారు. నేడు ప్రభుత్వ బడులలో ఆధునిక భవనాలు, శుభ్రమైన మరుగుదొడ్లు, విశాలమైన మైదానంతో పాటు విద్యార్థులు బాగా చదువు కునేందుకు వీలుగా అహ్లాదకరమైన వాతావరణం నెలకొని ఉందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా తరగతి గదులలో డిజిటల్ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టారని చెప్పారు. దాంతోపాటు స్టూడెంట్స్ కిట్ పేరుతో కొన్ని వేల రూపాయలు విలువ చేసే పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగు, బెల్ట్, షూలను అందజేస్తున్నామని చెప్పారు. గోరుముద్ద ద్వారా గుడ్డు, చిక్కీలతో పాటు రుచికరమైన భోజనాన్ని, రాగి జావను విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం అందించే ఈ సదుపాయాలను విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉపయోగించుకోవాలన్నారు. పిల్లలను పనిలో పెట్టుకోవడం నేరమని వారందరూ బడిలోనే ఉండాలన్నారు. కాబట్టి 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యాభివృద్ధి కార్యక్రమాల గురించి పిల్లలు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి 100 శాతం పిల్లలు పాఠశాలలకు వచ్చేలా చర్యలు తీసుకోవడం అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి, పాఠశాల పేరెంట్స్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, రెడ్డయ్యరెడ్డి, విజయ భాస్కర్, రవిశంకర్, విజయసారథిరెడ్డి, రెడ్డయ్య రాజు, నాగేశ్వర నాయక్, పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మడితాటి నరసింహారెడ్డి

హిందీ మెటీరియల్ పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు, సయ్యద్ సర్రాజ్ హుస్సేన్

ఉచితంగా హిందీ స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని బావికాడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రేమ్ చంద్ హిందీ భవన్ సొసైటీ రాజంపేట ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు సొసైటీ వ్యవస్థాపకుడు సయ్యద్ సర్రాజ్ హుస్సేన్ ఉచితంగా హిందీ స్టడీ మెటీరియల్ అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఘురాంప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయులు లేని పరిస్థితిలో మా విద్యార్థులకు ఉచితంగా హిందీ స్టడీ మెటీరియల్ ఇవ్వడం సంతోషకరమని అన్నారు. సొసైటీ వ్యవస్థాపకుడు సయ్యద్ సర్రాజ్ హుస్సేన్ మాట్లాడుతూ ఇక్కడ హిందీ ఉపాధ్యాయుడు లేరని, స్టడీ మెటీరియల్ అయినా ఇస్తే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని భావించి ఉచితంగా అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామిరెడ్డి, గంగాధర్, ప్రసాద్ బాబు పాల్గొన్నారు.

7, 8, 9 తరగతుల ప్రవేశానికి అర్హత పరీక్ష

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో బుధవారం 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 7,8,9 తరగతులలో ఖాళీగా ఉన్న సీట్లకు అర్హత పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ లీలా శ్రీహరి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఇటువంటి మంచి అవకాశాన్ని మండల పరిధిలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రశ్న పత్రమును జిల్లా విద్యాశాఖ అధికారుల ఆధ్వర్యంలోనే ఉంటుందని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బిసి విద్యార్థులకు పరీక్ష ఫీజు 75 రూపాయలు, ఒసి విద్యార్థులకు 100 రూపాయలు పరీక్ష ఫీజు చెల్లించి పరీక్షలో పాల్గొనవచ్చునని తెలిపారు. పరీక్ష ఉదయం పదిగంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మండలంలో మంగళవారం విద్యుదాఘాతంతో బుర్రా జనార్దన్ (47) మృతి అనే వ్యక్తి మృతి చెందారు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు కోడూరు మండలం బొజ్జ వారిపల్లెకు చెందిన బుర్రా జనార్దన్‌కు మూడు ఎకరాలపొలం ఉందని తెలిపారు. పొలంలో అరటిని సాగు చేసి మంగళవారం అరటి తోటకు నీరు పారగాటేందుకు మోటారు స్టార్టర్ ఆన్ చేస్తున్న సమయంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్టుతెలిపారు. మృతుడికి భార్య సంపూర్ణ, కుమారుడు రవి, కుమార్తె రవిత ఉన్నారు. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న జనార్దన్ మృతి చెందడంతో భార్యా పిల్లలు బోరున విలపించారు. ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

జనార్దన్ (ఫైల్ ఫోటో)

మదనపల్లిలో మరో మహిళ పరిస్థితి విషమం..

ప్రజాశక్తి-మదనపల్లి అర్బన్ : విద్యుదాఘాతంతో మహిళ తీవ్రంగా గాయపడింది. గాయపడిన మహిళ కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లి బయార్రెడ్డి కాలనీకి చెందిన హరికృష్ణ భార్య కవిత(30) సోమవారం రాత్రి కురుస్తున్న జోరు వర్షంలో లైట్లు వేయడానికి వేసేందుకు స్విచ్ ఆన్ చేసినట్లు చెప్పారు. ఆమెకు ఒక్కసారిగా విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడిందని పేర్కొన్నారు. వెంటనే జిల్లా బోధనాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించినట్లు తెలిపారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో అక్కడి నుంచి రుయాకు తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

విత్తనాల నిల్వకు గోదాము సిద్ధం

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక వెలుగు కార్యాలయం ప్రక్కన ఉన్న ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ విత్తనాలు కాయలను నిలువ ఉంచడానికి మండల కేంద్రానికి విత్తనాలను కలెక్షన్ ఉంచే గోదామును రూ.15 లక్షల వ్యయంతో నిర్మించారు. మండలంలోని 17 గ్రామాలలో ఉన్న రైతులు పండించిన పంటలు కాయలు విత్తనాలను ఇక్కడ తీసుకుని వచ్చి నిల్వ ఉంచుకోవడానికి ఎంతో ఉపయోగపడుతుందని రైతులు పేర్కొన్నారు. గ్రామాలలో రైతులు వర్షానికి తడవకుండా, ఎండకు ఎండకుండా ఆ వస్తువులను ఆ వ్యవసాయ విత్తనాలను గ్రామాల నుంచి తీసుకొచ్చి ఇక్కడ ఉంచుకునేందుకు ఉపయోగపడుతుందని అన్నారు.

రైతుల విత్తనాల నిల్వ కేంద్రం

పిఎం కిసాన్ నిధులను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

పిఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మురళీమోహన్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకం ద్వారా రైతులకు 17వ విడత నిధులను మంగళవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విడుదల చేసినట్లు తెలిపారు. మండలంలో రూ.1.20 కోట్లను 6042 మంది రైతులు లబ్ది పొందడం జరిగిందన్నారు. ప్రధానమంత్రి నిధులను విడుదల చేసే ప్రత్యక్ష కార్యక్రమాన్ని మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాలలోనూ రైతులకు అవగాహన కల్పించడానికి ప్రదర్శించినట్లు తెలిపారు. ఈ నిధులను రైతులు ఖరీఫ్ సీజన్లో సాగు చేసే వ్యవసాయ అవసరాల కోసం వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

30 మంది ఇంటర్ విద్యార్థులు ఉత్తీర్ణత

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం సప్లమెంటరీ పరీక్ష ఫలితాల్లో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 32 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 30 మంది పాసయ్యారు. ఇద్దరు మాత్రమే ఫెయిల్ అయినట్లు ప్రిన్సిపల్ సాయి శంకర్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ మోడల్ స్కూల్లో 22 మంది పరీక్షకు హాజరు కాగా అందరూ ఉత్తీర్ణత సాధించి వంద శాతం ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపల్ హేమంత్ కుమార్ తెలిపారు.

సిఎం చిత్రపటాలు అందజేత

ప్రజాశక్తి- రామసముద్రం

మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల పార్టీ అధ్యక్షులు విజయ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ కార్యాలయాలకు సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, ,ఎమ్మెల్యే షాజహాన్ బాషా చిత్ర పటాలను ఎఒ రమణాకు అందించారు. పోలీస్టేషన్‌లో ఎస్ఐ చంద్రశేఖర్‌కు అందించారు. కార్యక్రమంలో అల్తాఫ్, జయరాజ్, జావిద్, చంద్రప్ప, సిసి వెంకటరమణ, వెంకటరమణ నాయుడు పాల్గొన్నారు.

జడ్‌పి కార్యాలయంలో సిఎం, డిప్యూటీ సిఎం, ఎమ్మెల్యే చిత్ర పటాలను అందిస్తున్న టిడిపి నాయకులు

కూలిన కల్వర్టు..పొంచి ఉన్న ప్రమాదం

- ఎత్తైన వంతెనలు కట్టాలని కోరుతున్న ప్రజలు
- ఆర్అండ్‌బి అధికారుల స్పందనకు ఎదురుచూపులు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల కేంద్రమైన నిమ్మనపల్లి నుంచి వాల్మీకిపురానికి ప్రజలు రాకపోకలు కొనసాగించడానికి అనుసంధానమైన ప్రధాన రహదారి మార్గంలోని బహుదా నదిపై ఉన్న కల్వర్టు కూలిపోయి ఏ క్షణమైనా ప్రమాదం సంభవించే స్థితికి చేరింది. వివరాల్లోకి వెళితే..నిమ్మనపల్లి నుంచి వాల్మీకిపురం మండలానికి నిత్యం ప్రజలు, రైతుల, ప్రయాణికులు ప్రధాన రహదారి అయిన ఈ మార్గం గుండానే రాకపోకలు కొనసాగిస్తూ వస్తున్నారు. విద్యార్థులు పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లాలన్నా, రైతులు వ్యవసాయ ఉత్పత్తులను వాల్మీకిపురం, గుర్రంకొండ మార్కెట్‌లకు రవాణా చేసుకోవాలన్న, తమ భూములను క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లు వంటి లావాదేవీలు నమోదు చేసుకోవాలన్న నిత్యం ప్రజలు వాల్మీకిపురంకి వెళ్లి రావాల్సి ఉంది. అటువంటి మార్గంలో బహుదానదిపై కట్టిన కల్వర్టు గతంలో తుఫాన్ వల్ల వచ్చిన వరదల కారణంగా దెబ్బతిన్నది. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి దెబ్బతిన్న కల్వర్టు సగభాగం కూలిపోయింది. మరోచోట పెద్ద రంధ్రం పడి కూలడానికి సిద్ధంగా ఉంది. ప్రస్తుతం ఈ మార్గం నుంచే వాహనాల రాకపోకలు కొనసాగిస్తున్నారు. కూలిన కల్వర్టుపై వాహనాల రాకపోకలు కొనసాగిస్తుంటే ఏ క్షణమైనా ప్రమాదం జరగవచ్చని ప్రయాణికులు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఈ మార్గం గుండా రాత్రి వేళల్లో వాహన దారులు ప్రయాణించాలంటే మరింత ప్రమాదకరంగా మారింది. ఇదిలా ఉండగా బహుదా నదిపైనే ముష్టూరు వద్ద ఉన్న వంతెన కూడా గత తుఫాను వరదల దాటికి తెగిపోయిందని, తాత్కాలికంగా మట్టిని తొలి ప్రస్తుతం రాకపోకలు కొనసాగిస్తున్నట్లు ప్రజలు తెలిపారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో మరోసారి భారీ వర్షాలతో వరదలు వస్తే పూర్తిస్థాయిలో బ్రిడ్జిలు కొట్టుకుపోవడం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి వరదలు వచ్చినా ప్రయాణికులు రాకపోకలు కొనసాగించటానికి ఈ మార్గంలో తీవ్ర ఇబ్బందులు పడుతూ వస్తున్నారని తెలిపారు. బహుద నదిపై ఎత్తయిన వంతెనలను కట్టాలని, ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం ఇప్పటికైనా రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచాలని అంటున్నారు. కనీసం ఇప్పటికైనా రోడ్లు భవనాలశాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి ప్రమాదాలు జరగకుండా వెంటనే చర్యలు చేపట్టాలని, ఎత్తయిన వంతెనలను కట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కొమ్మిరెడ్డిగారిపల్లి వద్ద బహుదా నదిపై కూలిన కల్వర్టు

స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ సత్తా చాటుతాం

నినాదాలు చేస్తున్న టిడిపి, జనసేన నాయకులు

పజాశక్తి-ములకలచెరువు

వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కూటమి సత్తా చాటుతుందని టిడిపి, జనసేన నాయకులు పేర్కొన్నారు. పిటిఎం మండలంలోని దేవప్పకోట పంచాయతీ మిట్టసోంపల్లిలో మంగళవారం ఎన్‌డిఎ కూటమి జెండాల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనసేన తంబళ్ళపల్లె నియోజకవర్గ భాద్యుడు పోతుల సాయినాథ్ , టిడిపి నాయకులు మంత్రి గిరిధర్‌రెడ్డి హాజరై జెండాలను ఆవిష్కరించారు. అనంతరం కేకును కోసి పంచి పెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి కూటమి గెలుపునకు ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేశారని అన్నారు. ఇదే స్ఫూర్తితో గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేసుకుందామని అన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ అభివృద్ధి చేస్తారని పేర్కొన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి జెండా ఎగురవేసి నియోజక వర్గంలో కూటమి సత్తా చాటుదామని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అనిత, ఉపసర్పంచ్ గంగులమ్మ, జనసేన మండల అధ్యక్షుడు శంకర, ఉపాధ్యక్షుడు సూరి, నాయకులు మురళీ, సురేష్ కృష్ణ, మస్తాన్‌రెడ్డి, తరుగు శివారెడ్డి, మంజునాథ, ఆంజి, రమేష్, మల్లికార్జున పాల్గొన్నారు.

టమోటా తోటలో దొంగలు పడ్డారు

- సుమారు 40 బాక్సుల టమోటాల అపహరణ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

సాంకేతిక పరిజ్ఞానం అమాంతంగా పెరుగుతున్న ఈ రోజుల్లో దొంగల సైతం తమ దొంగతనాల పంథాను మార్చుకుంటున్నారు. మండల పరిధిలోని గట్టు గ్రామ పంచాయతీ,గుట్టపాళ్యం చెందిన రమణారెడ్డి టమోటా తోటలో దొంగలు పడ్డారు. మొత్తం 40 క్రేట్ల టమోటాలను దొంగలించుకొనిపోయారు. ఈ సందర్భంగా రైతు రమణారెడ్డి మాట్లాడుతూ తన పొలంలో సాగు చేసిన టమోటా ప్రస్తుతం కోత దశలో ఉందని అన్నారు. ప్రస్తుతం మార్కెట్లో టమోటా ధరలు బాగున్నాయని అన్నారు.30 కేజీల క్రేట్ ధర రూ.1500 నుండి రూ.2000 వేల వరకు పలుకుతోందన్నారు. తమ తోటలో టమోటాలు విరివిగా ఉండడాన్ని గమనించిన దుండగులు 40 క్రేట్లను అపహరించుకుని పోయారని అన్నారు. తనకు రూ.70 వేలు నష్టం వాటిల్లిందని అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని పోలీసులు దొంగలపై దృష్టి సారించాలని తెలిపారు. లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి సాగుచేసిన పంటలు ఇలా దొంగలు దోచుకుంటున్నారని, తనకు అధికారులు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

టమోటా తోట

బిసిజి టీకాతో క్షయ దూరం : డాక్టర్ మునికుమార్

వయో వృద్ధులకు టీకా వేస్తున్న వైద్యసిబ్బంది

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

బిసిజి టీకాతో క్షయ దూరం అవుతుందని వయోజనులంతా తప్పక బిసిజి టీకా వేయించుకోవాలని డాక్టర్ మునికుమార్ పేర్కొన్నారు. వైద్య ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు అనుకున్న లక్ష్యాలను పూర్తి చేసేందుకు మంగళవారం ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి 522 మందికి టీకా వేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ క్షయ వ్యాధిని పూర్తిగా నివారించేందుకు బిసిజి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. గతంలో గురువారం మాత్రమే ఈ క్యాంప్ నిర్వహించేవారని ఇప్పుడు మంగళవారం కూడా ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి టీకా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 60 సంవత్సరాలు వయస్సు దాటిన వారు, సిగరేట్, బీడీ అలవాటు కలవారు, క్షయ రోగులతో కలసి జీవించే వారు తప్పక టీకా వేయించుకోవాలని సూచించారు. ఇప్పటివరకు మండలంలో 2,592 మందికి బిసిజి వ్యాక్సిన్ ఇచ్చినట్లు తెలిపారు. పంచాల మర్రిలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం నిర్వహించినట్లు తెలిపారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్సలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయంతో ఇబ్బందులు

ప్రజాశక్తి-కలకడ

విద్యుత్ అంతరాయంతో మండలంలో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మండల కేంద్రమైన కలకడ పరిసర ప్రాంతాలలో విద్యుత్ లేకపోవడంతో దోమలకాటుకు గురై పలు ఇబ్బందులకు గురవుతున్నామని ప్రజలు వాపోతున్నారు. సోమవారం రాత్రి కొద్దిపాటి వర్షానికి రాత్రి ఎంత విద్యుత్తు లేకపోవడంతో మండల ప్రజలందరూ జాగారం చేయవలసిన దుస్థితి ఏర్పడినట్లు పలువురు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం ఏడు గంటల సమయం దాటినప్పటికీ విద్యుత్ రాకపోవడంతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడ్డారని అన్నారు. రాత్రి వేళల్లో విష సర్పాలు వచ్చేందుకు వీలు ఉండడంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు భయభ్రాంతులతో నిద్రించవలసిన దుస్థితి ఏర్పడిందని భయాందోళన చెందారు. విద్యుత్ లేకపోవడం వల్ల పలుచోట్ల చోరీలు జరిగేందుకు అవకాశాలు మెండుగా ఉన్నట్లు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ కోతలు నివారించాలని ప్రజల కోరుతున్నారు.

విద్యుత్ లేక చీకటిమయంగా ఉన్న హోటల్

పోలవరం ప్రశ్నార్థకం కావడం దురదృష్టకరం

ప్రజాశక్తి - వేంపల్లె

పోలవరం ప్రశ్నార్థకం కావడం దురదృష్టకరమని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మోడీ ప్రభుత్వ నిర్లక్ష్యం, చంద్రబాబు, జగన్ ప్రభుత్వాల అసమర్థతతోనే పోలవరం ప్రశ్నార్థకంగా మారింద న్నారు. పోలవరం బహుళార్థసాధక జాతీయ ప్రాజెక్టు అన్నారు. పోలవరం కాంగ్రెస్ పార్టీ మానస పుత్రిక అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఉంటే ఎప్పుడో పూర్తయి ఉండేదన్నారు. ఆలస్యం అమృతం విషం అన్నట్లు జాప్యం అయ్యేకొద్దీ పోలవరానికి కొత్త సమస్యలు వచ్చాయన్నారు. కేంద్రం నిధులు ఇవ్వని కారణంగా నిర్వాసితుల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. దీంతో అప్పర్ కాపర్ డ్యాం సకాలంలో పూర్తి కాలేదని తెలిపారు. 2020లో వచ్చిన వరదలకు డయాఫ్రమ్ వాల్ దెబ్బతిందని తెలిపారు. ప్రధాన డ్యాం కట్టాల్సిన స్థలంలో పెద్ద గోతులు ఏర్పడ్డినట్లు చెప్పారు. దీంతో గైడ్ బండ్ కుంగిపోయిందని వివరించారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాంకేతిక, ఆర్థిక ఇబ్బందులను పరిష్కరించి వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ కోరుతోందని తులసిరెడ్డి పేర్కొన్నారు.

ఎన్.తులసిరెడ్డి

'భట్టి'ని కలిసిన కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి - వేంపల్లె

తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కాంగ్రెస్ నాయకులు కలిశారు. మంగళవారం హైదరాబాద్ ప్రగతి భవన్‌లో ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఎపి మాజీ పిసిసి అధ్యక్షుడు శైలజా నాథ్, పులివెందుల కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ధృవకుమార్‌రెడ్డి, అనంతపురం డిసిసి అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి భట్టి విక్రమార్కతో రాష్ట్ర రాజకీయాలపై చర్చించారు. 2024 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వచ్చిన ఓటింగ్ శాతంపై కూడా చర్చించారు. ఎపిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కష్టపడి పని చేయాలని ఆయన సూచించారని తెలిపారు. రానున్నకాలంలో ఏపిలో కూడా కాంగ్రెస్ బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా పార్టీకి అండగా నిలవాలని కోరారని తెలిపారు.

నేడు అవధూత వీరయ్య స్వామి ఆరాధన

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని భద్రిపల్లె గ్రామంలో వెలసిన దిగంబర వీరయ్య స్వామి 47వ ఆరాధన మహోత్సవాలు బుధవారం నిర్వహిస్తున్నట్లు డెవల ప్మెంట్ కమిటీ సభ్యులు తెలిపారు. గురుపూజ పుష్పాలంకరణతో కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. వివిధ గ్రామాల తాళాల భజన బృందాలచే 24 గంటల పాటు నిరంతరం కార్యక్రమం ఉంటుందన్నారు. బుధవారం రాత్రి శ్రీ సాయి నాట్య కళా సమితి అద్దంకి వారిచే భక్త చింతామణి పూర్తి నాటకం, శివలీల వైభవం ఉంటుందన్నారు. అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ముక్కా, ఎమ్మెల్యే శ్రీధర్

నూతన బస్టాండ్‌ను నిర్మించండి

- మంత్రికి 'ముక్కా', ఎమ్మెల్యే శ్రీధర్ వినతి

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

రైల్వే కోడూరు పట్టణంలో ప్రయాణికుల సౌకర్యార్థం నూతన బస్టాండ్‌ను నిర్మించాలని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రూపానంద రెడ్డి మాట్లాడుతూ గత కొన్ని దశాబ్దాలుగా రైల్వే కోడూరులో బస్టాండ్ లో సరైన వసతులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పూర్తిగా సర్వే చేయించి ప్రజలకు అనుకూలంగా ఉండే అత్యాధునిక సదుపాయాలతో కూడిన బస్టాండ్‌ను నిర్మించాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో రూపానందరెడ్డి తనయుడు ముక్కా సాయివికాస్ రెడ్డి, టిడిపి నాయకులు నరసింహారెడ్డి పాల్గొన్నారు.

సిఎం, ఎమ్మెల్యే చిత్రాలకు పూలాభిషేకం చేస్తున్న విభిన్న ప్రతిభావంతులు

పింఛను పెంపుపై హర్షం

ప్రజాశక్తి-కలికిరి

విభిన్న ప్రతిభావంతుల పింఛను పెంపుపై వికలాంగు సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం చెవిటి, మూగ వికలాంగుల సంఘం నాయకులు జయచంద్ర ఆధ్వర్యంలో కలికిరి క్రాస్ రోడ్డులోని గాంధీ విగ్రహం వద్ద ముఖ్య మంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి ఫోటోలకు పాదాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన హామీ మేరకు రూ.3వేల నుంచి రూ.6వేలకు పింఛన్‌ను పెంచడం సిఎం చంద్రబాబు నిబద్ధత, రాజకీయ దక్షతకు నిదర్శనమని అన్నారు.

ఉపాధ్యాయులకు ఫిజియోథెరపీపై శిక్షణ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలోని సభా భవనంలో ఫిజియోథెరపీపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. నిజాం హాస్పిటల్, హైదరాబాద్ నుండి డాక్టర్ సంతోష్ కుమార్ విచ్చేసి ప్రధానోపాధ్యాయులందరికీ శిక్షణనిచ్చారు. శిక్షణలో భాగంగా సెల్‌ఫోన్ వాడకంపై తగు సూచనలు అందించారు. దైనందిన జీవితంలో ఫిజియోథెరపీ అవసరం, దాని ఆవశ్యకతను వివరించారు. వైద్యులు ఫిజియోథెరపీపై డెమో ఇచ్చారు. మండల విద్యాశాఖ అధికారి శివప్రసాద్ మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలను పాఠశాల స్థాయిలో విద్యార్థులతోపాటు తల్లితండ్రుల సమావేశాల్లో వారికి కూడా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు వెంకటేశ్వర్లు, ఐఇఆర్ పి.రవికుమార్, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ సతీష్, మండల విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలని మలేరియా యూనిట్ అధికారి లక్ష్మయ్య, ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి సూచించారు. మండలంలోని దేనేపల్లెలో సిబ్బంది జ్వరం, లార్వా సర్వే నిర్వహించారు. పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. సర్వేను అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకునేలా ఆరోగ్య విద్య ద్వారా అవగాహన కల్పించి చైతన్య వంతులను చేయాలని సిబ్బందికి సూచించారు. గ్రామంలో జ్వరం కేసులు నమోదు కాలేదన్నారు. వాటర్ ట్యాంక్ క్లోరినేషన్ చేయించాలని స్థానికులు కోరారని తెలిపారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ జాసన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి పలు సమస్యలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల : జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డిని, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ రెడ్డిని మంగళవారం దేవగుడిలోని తమ నివాసంలో ఎర్రగుంట్లకు చెందిన పలువురు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపి, ఘనంగా సత్కరించారు. అనంతరం పట్టణంలోని పలు సమస్యలను మల్లు గోపాల్‌రెడ్డి ఎమ్మెల్యే, భూపేష్ దృష్టికి తీసుకెళ్లారు. చిలంకూరు గ్రామ సమస్యలను ఎంపిటిసి నవీన్, నాయకులు బాల అంకిరెడ్డి, నాగేశ్వరరెడ్డి తెలుపగా సంబంధిత అధికారులకు చెప్పి వెంటనే సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే, భూపేష్ రెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శివారెడ్డి, లక్ష్మీనారాయణ, శివ శంకర్‌రెడ్డి, శ్రీను, అభిలాష్‌రెడ్డి, ఆంజనేయరెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పోలీసులు స్వాధీనం చేసుకున్న జెసిబి, లారీ

ఇసుక అక్రమ రవాణాపై దాడులు

- జెసిబి, లారీ సీజ్

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని ఆడపూరు గ్రామపంచాయతీ మర్రిపల్లి గ్రామ సమీపంలోని చెయ్యేరునది నుంచి సోమవారం రాత్రి ఇసుక అక్రమ రవాణా చేస్తుండగా ఎస్ఇబి పోలీసు అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ మాట్లాడుతూ ఈ దాడులలో రెండు టిప్పర్లు, ఒక జెసిబి స్వాధీనం చేసుకున్నామని అన్నారు. ఎస్ఇబి వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

లారీ, బైక్ ఢీ : వ్యక్తి మృతి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణ శివారులోని ఊటుకూరు సమీపంలోని అశోక్ గార్డెన్ వద్ద మంగళవారం ద్విచక్ర వాహనం, లారీ ఢీకొనడంతో రమణయ్య (45) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా మణి అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితులు పుల్లంపేట మండలం బాయికాడపల్లికి చెందిన వ్యక్తులుగా తెలిసింది. పుల్లంపేట నుండి రాజంపేటకు వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. రాజంపేట రూరల్ సీఐ రవీంద్రనాథ్ సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.